క్లుప్తంగా

నర్సరీల పరిశీలన



లాలితండాలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : వర్షాలు బాగా కురిస్తే పదవ విడత హరితహారం కార్యక్రమం చేపట్టేందుకు గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ మామిడి జానకిరాములు అన్నారు. బుధవారం మఠంపల్లి మండలంలోని లాలితండా, తుమ్మలతండా, కొత్తతండా తదితర గ్రామ పంచాయతీలలోని నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట కార్యదర్శులు ఉమ, రాజు, సిబ్బంది ఉన్నారు.

గ్రామ వెలుగు నాట్యమండలి నూతన కమిటీ ఎన్నిక



సత్యనారాయణ, అధ్యక్షుడు



సారిక పెదరామయ్య, కార్యదర్శి

మునగాల : మండలంలోని రేపాల గ్రామానికి చెందిన రచయిత, కళాకారుడు, స్వర్గీయ కోదాటి నరసింహారావు స్థాపించిన గ్రామ వెలుగు నాట్యమండలి నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మొగిలిచర్ల సత్యనారాయణ, కార్యదర్శిగా సారిక పెదరామయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. గ్రామవెలుగు నా ట్యమండలి ద్వారా కళాకారులను ప్రోత్సహించి కళారంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, కళాకారులు పాల్గొన్నారు.

పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో నీటి సౌకర్యం



బోర్ మోటారును ప్రారంభిస్తున్న పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

చిలుకూరు : మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన బోరు, విద్యుత్ మోటార్‌ను బుధవారం ఆ సంస్థ డైరెక్టర్ జెర్సిపాల్, బోర్ వెల్ సంస్థ ప్రతినిధి కర్రె ఏసుదాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెర్సిపాల్ మాట్లాడుతూ.. గ్రామంలోని పేద విద్యార్థులకు తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్యూషన్ పాయింట్, గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పులగం లక్ష్మీనారాయణ, నిర్వాహకులు అబ్రహం, కె.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాసశివరాత్రి



ప్రత్యేక అలంకరణలో మహాశివుడు

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో మాసశివరాత్రి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి ప్రత్యే పూజలు నిర్వహించారు. స్వామివారికి మహాన్యాస పూర్వకంగా ఏకదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమపూజ, నవవిధ హారతులు, విశేష పుష్పాలంకరణ, శ్రీలక్ష్మి గణపతి రుద్ర నవగ్రహ వాస్తు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చిలుకూరు : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన బుధవారం చిలుకూరు మండల పరిధిలోని దూదియాతండా గ్రామంలో జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాణోతు శ్రీనుకు చెందిన పాడి గేదె రోజూ మాదిరిగా మేత కోసం పొలాల్లోకి వెళ్లగా విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

- చెరువులు, పంట కాల్వల పూడికతీత
- ప్రతిరోజూ 4418 మంది కూలీలకు ఉపాధి హామీ పనుల కల్పన



కాచవారిగూడెంలో చెరువు పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు



కోదండరాంపురంలో పంటకాల్వ పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

గరిడేపల్లి : మండల వ్యాప్తంగా జాతీయ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉపాధి హామీ అధికారులు ఫిబ్రవరి నుంచి కూలీలకు పనులు కల్పిస్తున్నారు. గరిడేపల్లి మండలం పూర్తి ఆయకట్టు కావడంతో పంట కాల్వలు, చెరువుల పూడికతీత పనులు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 32 గ్రామ పంచాయతీల పరిధిలో 16998 ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 39251 మంది కూలీలు నమోదై ఉన్నారు. వీరిలో 17951 మంది మాత్రమే ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. మండల వ్యాప్తంగా ప్రతిరోజూ 4418 మంది ఉపాధి కూలీలు పనులకు వెళ్తున్నారు. కాగా, 2024– 25 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 2,24,616 పని దినాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు రూ.5 కోట్ల 85 లక్షల 99 వేల వేతనాలు కూలీలకు చెల్లించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు మండలంలో 2339 పనులు పూర్తి అయ్యాయి. భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో చెరువుల పూడికతీత పనులు చేపడుతున్నారు. గడ్డిపల్లి, రేగులగడ్డతండా, చిన్నగారకుంటతండా, గానుగబండ, కాచవారిగూడెం, అబ్బిరెడ్డిగూడెం, కోందరాంపురం, రామచంద్రాపురం, గరిడేపల్లి, కల్మలచెరువు గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. చెరువుల్లో ఉపాధి హామీ కూలీలు తవ్వే నల్లమట్టిని రైతులు తమ పొలాలకు తోలుకుంటున్నారు. ఉపాధి పనులను ఎంపీడీఓ, ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పనులు కల్పించడంలో పాటు వేతనాలు కూడా సకాలంలో అందుతుండడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వారానికోసారి వేతనాలు



మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లోఇప్పటివరకు 2339 పనులు చేపట్టాం. ప్రతిరోజూ 4418 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. 2,24616 మందికి ఇప్పటి వరకు పనులు కల్పించాం. పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. కూలీలకు వారానికోసారి వేతనాలు అందిస్తున్నాం.

– రాయికింది సురేష్, ఏపీఓ, గరిడేపల్లి

రైతులు సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చింతలపాలెం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల రశీదులు వెంటనే తీసుకోవాలని, వాటిని పంట పూర్తయేంత వరకు భద్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం చింతలపాలెంలోని విత్తనాల దుకాణంలో విత్తనాలు, స్టాక్ రిజిస్టర్, రికార్డులను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు, లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో బీఆర్‌ఎస్ పార్టీ కుమ్మక్కు



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీతో బీఆర్‌ఎస్ పార్టీ కుమ్మక్కైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు ఆరోపించారు. బుధవారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలవకుండా కుట్ర పన్నిన బీఆర్‌ఎస్‌కు తగిన రీతిలో ఓటర్లు బుద్ధి చెప్పారని అన్నారు. బీజేపీకి తెలంగాణలో ఎనిమిది సీట్లు రావడం బీఆర్‌ఎస్ పార్టీ పెట్టిన భిక్ష అని అన్నారు. రానున్న రోజుల్లో ఇండియా కూటమి మరింత బలోపేతం కావడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సీతారాంపురంలో మహిళా సమాఖ్య జెండా ఆవిష్కరిస్తున్న మల్లీశ్వరి

చిలుకూరు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవర మల్లీశ్వరి అన్నారు. మహిళా సమాఖ్య ఏర్పడి 71 వసంతాలు పూర్తయిన సందర్భంగా బుధవారం చిలుకూరు మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ఆమె ఆరోపించారు. మహిళల పట్ల చులకన భావన, అసమానతలు ఉండవద్దని అన్నారు. అనంతరం మహిళా సమాఖ్య జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల కార్యదర్శి సాతులూరి అలివేలు, మౌనిక, లక్ష్మి, నాగేంద్ర, సుజాత, మంగమ్మ, పద్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో బీజేపీ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నడిగూడెం : కేంద్రంలో ఎన్‌డీఏ విజయం, మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కాబోతుండడంతో బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు బండారు కవిత, మండల అధ్యక్షుడు దున్నా సతీష్, నాయకులు షేక్ లతీఫ్, బండారి శోభారాణి, వట్టికూటి పాపయ్య, మేకల నాగరాజు, పరబ్రహ్మచారి, మల్సూర్, వీరన్న, పాపయ్య పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



మడతనపల్లి ఉషశ్రీ



ఎడ్ల సాయిదిశ్విత



మీసాల శృతి

హుజూర్‌నగర్ : దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) ఫలితాల్లో హుజూర్‌నగర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పట్టణానికి చెందిన మడతనపల్లి నవత– నర్సింహారావుల కూతురు మడతనపల్లి ఉషశ్రీ 720 మార్కులకు గాను 690 మార్కులు సాధించి 99.77 పర్సంటేజ్‌తో ఆల్ ఇండియాలో 4,876 ర్యాంక్ సాధించింది. ఓబీసీ కేటగిరిలో 1,881 ర్యాంక్ కైవసం చేసుకుంది. అదేవిధంగా ఎడ్ల గోపయ్య– శారదల కూతురు ఎడ్ల సాయి దిశ్విత 657 మార్కులతో ఎస్సీ కేటగిరీలో 491 ర్యాంక్ సాధించింది. 98.97 పర్సంటేజ్‌తో ఆల్ ఇండియాలో 23,303 ర్యాంక్ వచ్చింది. దీంతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు అభినందించారు.

మీసాల శృతికి 29729 ర్యాంక్

గరిడేపల్లి : నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాల్లో గరిడేపల్లి మండలం కట్టవారిగూడెం గ్రామానికి చెందిన మీసాల శృతి ప్రతిభ చాటింది. 720 మార్కులకు గాను 421మార్కులతో ఎస్సీ కేటగిరిలో 29729 ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు మీసాల నాగరాజు, మరియమ్మ హర్షం వ్యక్తం చేశారు.

మేళ్లచెరువు శివాలయంలో మాసకల్యాణం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం మాసకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్ల విగ్రహాలను పూలు, పట్టు పీతాంబ్రాలతో అందంగా అలంకరించారు. అనంతరం పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. తదనంతరం స్వామివారి కల్యాణ ఘట్టాన్ని పూర్తిగావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

'చామల' గెలుపుతో మొక్కు తీర్చుకున్న రేఖ

అర్వపల్లి : భువనగిరి ఎంపీగా చామల కిరణకుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో మండల పరిధిలోని అడివెంల గ్రామ ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో బుధవారం జాతీయ టెన్నీస్ క్రీడాకారిణి, రేఖ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ మొక్కు తీర్చుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి మొట్టమొదటిగా గ్రామానికి వచ్చి ముత్యాలమ్మ దేవాలయంలో పూజలు చేసి ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా గెలిస్తే 101కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నానని, ఇందులో భాగంగా కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నట్లు ఆమె వెల్లడించారు. మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, ఎడ్ల సైదులు, మచ్చ లింగయ్య, మాదగాని అంజయ్య, ఎ.రవి, బి.వెంకన్న, శివ, పేరెల్లి ఉప్పలయ్య, వెంకన్న, యేసు, అన్వర్, గణేష్ పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డి గెలుపుపై హర్షం

నడిగూడెం : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం పట్ల ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, ఎంపీపీ యాతాకుల జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో నడిగూడెం మండలంలో కాంగ్రెస్‌కు 10 వేలకు పైగా మెజార్టీ వచ్చిందన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామశివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం ప్రాంగణంలో వెలిసిన శ్రీఉమామహేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వైభవంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు బ్రహ్మశ్రీ మనోహరశర్మ వేద మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, బండకవి కృష్ణమోహన్, కట్టికోల మధుసూదన్‌రావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ



హుజూర్‌నగర్‌లోని కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జడ్జీలు శ్యామ్‌కుమార్, మారుతీప్రసాద్



కోదాడ కోర్టులో మొక్క నాటిన జడ్జి శ్యాంసుందర్

హుజూర్‌నగర్ : చెట్లతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ అన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని కోర్టు ప్రాంగణంలో ఆయన జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే జీవకోటి మనుగడ అసాధ్యమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తమ ఇంటి పరిసరాల్లో కనీసం ఒక్క చెట్టునైనా నాటి పెంచాలని ఆయన సూచించారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కొందరు స్వార్థంతో చెట్లు, అడవులను నరికడం, చెరువులు, వాగులను ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కారణంగా పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడి అనేక దుష్ఫలితాలు కలుగుతున్నాయని అన్నారు. అలాంటి చర్యలను నియంత్రించాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కల్వ శ్రీనివాసరావు, ఎంఎస్ రాఘవరావు, ఎం.గోపీనాథ్, జె.సత్యనారాయణ, డి.మోహన్, మండల న్యాయ సేవా సంస్థ సిబ్బంది శ్యామ్‌కుమార్, సుశీల, జూనియర్, సీనియర్, కోర్టుల, అదనపు జిల్లా కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కోదాడరూరల్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యాంసుందర్, సెంకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సీహెచ్.సత్యనారాయణలు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కోదాడ పట్టణంలోని కోర్టు ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోకపోతే భవిష్యత్ తరాలు నష్టపోతాయని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, వాతావరణం కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. అడవులను పరిరక్షించుకోవాలని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని వారు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఆర్‌కె మూర్తి, సెక్రటరీ చింతకుంట్ల రామిరెడ్డి, సభ్యులు మంద వెంకటేశ్వర్లు, హేమలత, దొడ్డా శ్రీధర్, నవీన్‌కుమార్, నాగుల్ పాషా, ధనలక్ష్మి, వీరభద్రం, సుదర్శన రావు, మురళి తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలి

చిలుకూరు : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం చిలుకూరులో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, ఏపీఓ నిర్మల, టీఏ స్రవంతి, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

మఠంపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఎం.జానకిరాములు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మఠంపల్లి మండలంలోని పెదవీడు గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలమ్మ చెరువు కట్టపై ఆయన మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతామని గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా చౌటపల్లిలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడాలని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణ్‌నాయక్, కవిత, ఇంటి రవి, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నేరేడుచర్ల : పట్టణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో లయన్స్ క్లబ్, వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం వాసవీ క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, జోన్ చైర్మన్లు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు మాట్లాడారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. తదనంతరం గురుకుల పాఠశాలలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను లయన్స్, వాసవీ, వనితా క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు గెల్లి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి జూలూరు అశోక్, కోశాధికారి తాళ్లూరి శ్రీనివాస్, వనితా క్లబ్ అధ్యక్షురాలు గెల్లి లక్ష్మీప్రసన్న, మాజీ అధ్యక్షుడు కందిబండ శ్రీనివాస్‌రావు, ఉట్కూరు నటరాజ్, పాల్వాయి గోపాలకృష్ణ, ఉప్పల పుల్లయ్య, ఓరుగంటి శ్రీనివాస్, చందా కిషన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షుడు కర్రి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు యూసుఫ్, వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని తహసీల్దార్ బండ కవిత అన్నారు. బుధవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు నాటి పెంచకుంటే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పాలకవీడు : పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరాజు కోరారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని డెక్కన్ పరిశ్రమ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత, కాలుష్యాన్ని నియంత్రించడంలో వృక్ష సంపద కీలకం అని అన్నారు. కార్యక్రమంలో సీజీఎం ఎస్.నాగమల్లేశ్వరరావు, మైన్స్ జీఎం కళ్యాణచక్రవర్తి, జి.మస్తాన్, మెకానిక్ హెడ్ ఎస్.రావు, వివిధ విభాగాల ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మోతె : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మోతె మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కమలమ్మ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని నామవరం గ్రామంలో గల ఆరోగ్య ఉప కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి పర్యావరణ పరిరక్షణపై ఆమె అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో ఆరోగ్య కేంద్రంలో పరిసరాలను పరిశుభ్రం చేసి చెట్లకు నీరు పోశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంతి, ఎంపీహెచ్‌ఏ అలివేలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



చిలుకూరులో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎంపీడీఓ గిరిబాబు, తదితరులు



మఠంపల్లి : పెదవీడులో చింతలమ్మచెరువు కట్టపై మొక్క నాటుతున్న ఎంపీడీఓ జానకిరాములు



నేరేడుచర్లలో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు



మఠంపల్లి : చౌటపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు



నేరేడుచర్ల : పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తున్న లయన్స్, వాసవీ, వనితా క్లబ్‌ల సభ్యులు



గరిడేపల్లి : గడ్డిపల్లిలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్ కవిత



పాలకవీడు : మొక్కలు నాటుతున్న డెక్కన్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం, సిబ్బంది



మోతె : ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ కమలమ్మ